మీ-సేవా నిర్వాహకులకు ఈ -కామర్స్‌పై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవలు నిర్వహించడం వల్ల ఈ-కామర్స్ రంగంలో పెను మార్పులు వస్తాయని మీ-సేవా కమిషనర్ రవికిరణ్ తిరుమల అన్నారు. ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ఐటీశాఖ సంయుక్తాధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో గురువారం మీ-సేవా నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవల వల్ల స్థానిక ఎంఎస్ఎంఈ వ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ దీపు థామస్ జాయ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

చార్మినార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతదయాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. గురువారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ మెంబర్లు కంచెర్ల వందన, మర్రిపల్లి చందన, బి. అపర్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఉమెన్ సేఫ్టీ వింగ్ కమిషనర్ లావణ్య నాయక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో బ్లడ్ డెలివరీ సేవలు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ సేవలను లైటస్ పేరుతో నగరంలో గురువారం ప్రారంభించారు. ఏఐ ఆధారిత బ్లడ్ లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్‌గా దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలోనే దీన్ని ప్రారంభించామని లైటస్ హెల్త్‌టెక్ సీఓఓ సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు. ఇప్పటి వరకు చెన్నైలో 5 వేల మందికి రక్తం సరఫరా చేశామని, దీనికి రెడ్ క్రాస్ సొసైటీ నుంచి అవార్డు వచ్చిందన్నారు. నగరంలో సుమారు 100కు పైగా బ్లడ్ బ్యాంకులు ఉండగా, ఏడాదికి 2,75,000 యూనిట్ల రక్తం అవసరం ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా సరైన సమయంలో రక్తం అందించలేకపోతున్నారు. దీన్ని గుర్తించి హైదరాబాద్‌లో బ్లడ్ బ్యాంకులు, ఆస్పత్రులతో కలిసి సేవలను అందించనున్నామని సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఎయిర్ చీఫ్ మార్షల్

అల్వాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ)లో ఈనెల 14న నిర్వహిస్తున్న 215 కోర్స్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా భారత వాయుసేనాధిపతి(ఎయిర్ చీఫ్ మార్షల్) అమర్ ప్రీత్‌పాల్‌సింగ్ పాల్గొంటున్నారని రక్షణ శాఖ పౌర సంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన కీలకపాత్ర పోషించారు.

రౌడీషీటర్ హత్యకు పథకం

- మరో ముఠా సభ్యుల అరెస్ట్.. 12 కత్తులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పథకం వేసిన రౌడీషీటర్‌తోపాటు గ్యాంగ్ సభ్యులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 కొబ్బరి బొండాం కొట్టే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పహాడిషరీఫ్‌కు చెందిన మహ్మద్ జబ్బార్(43) పాత నేరస్థుడు. గతంలో రౌడీషీటర్ ముర్తుజా అలీ వద్ద పనిచేసేవాడు. జబ్బార్‌పై ట్రై కమిషనరేట్ల పరిధిలో హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, స్నాచింగ్ వంటి 12 కేసులు నమోదయ్యాయి. ఇతడిపై పోలీసులు రెండుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేయగా జైలుకెళ్లొచ్చాడు. ముర్తుజా వద్ద పనిచేయడం మానేసిన తర్వాత సొంత గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ముర్తుజాను చంపేందుకు జబ్బార్ పలు ప్రయత్నాలు చేశాడు. అలీని చంపేందుకు జమీర్ ఖాన్(30), రౌడీషీటర్ సయ్యద్ షాఅబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్(22), మహ్మద్ రహమత్ అలియాస్ సోను(28), సయ్యద్ షా అబ్దుల్ మన్నాన్ అలియాస్ సల్మాన్(31), మహ్మద్ నాసిర్(38)తో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. హత్య కోసం 12 కొబ్బరి బొండాలు కొట్టే కత్తులు కొనుగోలు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 12 కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు మొహసిన్, అజహర్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

- వెన్నెముకలో క్యాన్సర్ కణితి తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న మహిళకు కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళ (55) నడవలేని పరిస్థితిలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెన్నెముక భాగంలో క్యాన్సర్ కణితి పెరిగి పక్షవాతం స్టేజ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. క్యాన్సర్ కణితి తొలగించేందుకు 'ఎన్ బ్లాక్ రీసెక్షన్' శస్త్రచికిత్స చేశారు. మొదటి దశలో ఇంటర్‌వెన్షన్ 'ఎంబొలైజేషన్' పద్ధతిలో రోగికి ఇంజెక్షన్ ఇచ్చి, క్యాన్సర్ కణజాలానికి రక్తప్రవాహాన్ని నిలిపివేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన 24 గంటల తర్వాత వెన్నెముకలో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించారు. కణితి తొలగించిన ప్రాంతంలో ఇంప్లాంట్ అమర్చి నరాలపై ఒత్తిడి లేకుండా శస్త్ర చికిత్సను ఆరు గంటల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె నడవగలిగే స్థితికి చేరుకున్నారని డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్‌కు చెందిన ఆలియా భర్తతో గొడవపడి బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. భర్త వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పగా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె ఈనెల 7వ తేదీన సంజీవయ్య పార్కు సమీపంలో రైల్వే పట్టాల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న తండ్రి మహ్మద్ అక్కడకు వెళ్లి కుమార్తెకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండగా ఆ సమయంలో సికింద్రాబాద్ నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఆలియా అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన మహ్మద్‌ను స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



- సంక్షేమ భవన్ ముట్టడి

గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని సంక్షేమ భవన్‌ను ముట్టడించిన ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు.



సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురువారం పుస్తకాలు, యూనిఫాంలు అందుకున్నారు. కార్యక్రమానికి కార్పొరేటర్ కొలను లక్ష్మి హాజరై తన చేతులమీదగా పంపిణీ చేశారు.
బేగంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)



ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు గురువారం అందజేశారు. ముఖ్యఅతిథిగా సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు.
బంజారాహిల్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఖైరతాబాద్ షేక్‌పేట మండలాల ఉపవిద్యాధికారి శామ్యూల్‌రాజ్ విచ్చేసి అందించారు.
ఖైరతాబాద్,జూన్12(ఆంధ్రజ్యోతి):

విద్యార్థులకు గురువుల స్వాగతం

- వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- తొలిరోజు తగ్గిన హాజరు

పంజాగుట్ట, జూన్12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. ఖైరతాబాద్-షేక్ పేట మండలాల పరిధిలో మొదటి రోజు విద్యార్థుల హాజరు తక్కువగా నమోదు అయ్యింది. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాసి వెళ్లిపోవడం, కొంతమంది వివిధ కారణాలతో టీసీలు తీసుకుని వెళ్లిపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఉన్నవారిలో కొంతమంది మాత్రమే వచ్చారు. వారికి ఉపాధ్యాయులు పూలు ఇచ్చి స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణను ముస్తాబు చేశారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖైరతాబాద్-షేక్ పేట మండలాల ఉపవిద్యాధికారి శామ్యూల్ రాజ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,



ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్, వెంకట్ రెడ్డి

యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందజేశారు. మొదటి రోజు 35 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రధానోపాధ్యాయులు ఏ.వెంకట్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, పీఈటీ గాలప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో

వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ లోని అమీర్‌పేట నంబర్-1 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 344 మంది విద్యార్థులకు గాను 123 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతా రాథోడ్, ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. వెంగళరావునగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు గాను 78 మంది హాజరయ్యారు. వారికి ఉపాధ్యాయులు బి.మధు, ముజీబ్, మరియమ్మ, ప్రసాద్‌లు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను అందజేశారు.



బోరబండ : విద్యార్థికి పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి తదితరులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి

బోరబండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి పేర్కొన్నారు. బోరబండ బలహీనవర్గాల కాలనీ పెద్దమ్మనగర్‌లోని నాట్కో ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం జరిగిన పాఠశాల పునఃప్రారంభం, ప్రపంచ బాలకార్మిక నిర్మూలన దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. కిరణ్మయి, బోరబండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మల్కాపురం సురేందర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని గీత కల్వారి మాట్లాడుతూ తమ పాఠశాల కార్పొరేట్ స్కూల్స్‌కు ఏమాత్రం తీసిపోదన్నారు. పదోతరగతి పరీక్షల్లో పాఠశాల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన సి.దేవహర్ష, కె.జీవన్‌కుమార్‌ను అతిథులు సన్మానించారు.

బడీడు పిల్లలు సర్కారు స్కూల్స్‌లో చేరాలి


యూసుఫ్‌గూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలంతా సర్కారు బడిలోనే చేరాలని కలెక్టర్ ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ అన్నారు. బుధవారం యూసుఫ్ గూడా ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు యూనిఫాంలు నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలను అందజేశారు. సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాల ఇన్‌చార్జి నరసింహ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీదేవి, పాఠశాల ఎన్‌సీసీ అధికారి పి. ప్రభాకర్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో మంత్రి కొండా సురేఖ

ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన మంత్రి సురేఖ

అమీర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలోని ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని ఎండోమెంట్ ఉన్నతాధికారులతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం సందర్శించారు. ఈనెలలో నిర్వహించే అమ్మవారి కల్యాణం... బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి వెంట దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఓం ప్రకాష్, ఈఈ శర్మ,ఈవో కృష్ణ, ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ నాయకులు మిరియాల రాజు, రవి, రజినీకాంత్, తదితరులు ఉన్నారు.



గురుబ్రహ్మనగర్‌లో పర్యటిస్తున్న హౌసింగ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు

'ఇందిరమ్మ కాలనీ' స్థల సర్వే పూర్తి

బంజారాహిల్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ సమీపంలోని గురుబ్రహ్మనగర్‌లో ఇందిరమ్మ కాలనీ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు, రెవెన్యూ అధికారులు గురువారం స్థల సర్వే నిర్వహించారు. బస్తీలో సుమారు 240 మంది గిరిజనులు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయించి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వ స్థలం ఎంత ఉందని కొలతలు వేసి నివేదిక రూపొందించారు. ఇది పూర్తయిన తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని సికింద్రాబాద్ ఆర్డీఓ సాయికుమార్ తెలిపారు.

యథేచ్ఛగా రోడ్డు తవ్వకాలు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఖైరతాబాద్, జూన్12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పూర్తయ్యే వరకు నగరంలోని రోడ్లపై ఎలాంటి తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదని స్వయంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు ఇచ్చినా, కిందిస్థాయి అధికారులు దానిని పట్టించుకోవడం లేదు. గురువారం ఖైరతాబాద్ భారీ గణపతి నుంచి రైల్వే గేటు వైపు వెళ్తున్న మార్గంలో జాగీర్దార్ బాడ వీధి సమీపంలో ప్రైవేటు వ్యక్తులు రోడ్డును అడ్డంగా తవ్వారు. ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వారిని వివరణ కోరగా రోడ్డు తవ్వకం కోసం దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదన్నారు. రోడ్డు తవ్వినందుకు జరిమానా ఎందుకు వేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కురుమ సామాజికవర్గాన్ని విస్మరించడం తగదు

పంజాగుట్ట, జూన్12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో 16 శాతం జనాభా ఉన్న యాదవ, కురుమ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా మోసం చేసిందని యాదవ సంఘాల నాయకులు, యాదవ-కురుమ సంఘాల జేఏసీ ఆరోపించింది. దీనికి నిరసనగా ఈనెల 27న వేలాది మందితో ఇందిరాపార్కు వద్ద యాదవ- కురుమల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్టు జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'

పంజాగుట్ట, జూన్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం సరికాదని మున్నూరు కాపు సంఘం నాయకులు అన్నారు. ఈ సామాజిక వర్గం నుంచి గెలిచిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులలో ఈ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల లోపు వాటిని నెరవేర్చాలని లేకపోతే తమ కార్యాచరణను ప్రకటిస్తామని రాజన్న-సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చదల సత్యనారాయణ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు పటేల్, వివిధ జిల్లాల నాయకులు పి.అంజయ్య, జి.నర్సయ్య తదితరులతో కలిసి వారు మాట్లాడారు. త్వరలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి విన్నవిస్తామని తెలిపారు.

హైదరాబాద్‌లోనే ఇళ్లు కేటాయించండి

- లేనిపక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తాం
- భాగ్యనగర్ సంక్షేమ సంఘం

పంజాగుట్ట, జూన్12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రంగారెడ్డి జిల్లాలో కేటాయించారని, అక్కడి స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో హైదరాబాద్ కలెక్టర్ ఇచ్చిన ఇళ్ల పట్టాలు చెల్లవని హైకోర్టు తీర్పు ఇచ్చిందని భాగ్యనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కె శ్రీనివాస్, శేషులు అన్నారు. నగరంలోనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇళ్లు లేని పేదలు గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోమన్నారు. లాటరీ ద్వారా 1,730 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. 2023 అక్టోబరులో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగుడా సమీపంలోని మంకాల్‌లో ఇళ్లు ఇచ్చారన్నారు. స్థానికులు తమ ప్రాంతంలో స్థానికేతారులకు ఇళ్లు ఎలా ఇస్తారని న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ప్రభుత్వ జీవో 10 ప్రకారం హైదరాబాద్ కలెక్టర్ రంగారెడ్డిలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు చెల్లవని ఈ నెల 9న హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. 20 రోజులలోగా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని లేకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు

బంజారాహిల్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మంచినీటి నల్లాల్లో డ్రైనేజీ నీరు కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వాటర్ వర్క్స్ ఎర్రగడ్డ విభాగం మేనేజర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం శాస్త్రినగర్, హేమవతి నగర్ తదితర బస్తీలలో డ్రైనేజీ నీటితో మంచి నీటి నల్లాలో కలుషితమవుతున్న ప్రాంతాలలో మరమ్మతు పనులను నిర్వహించారు. వాటర్ వర్క్స్ సిబ్బందితో పాటు స్థానిక నాయకులు దూడల రవి గౌడ్, సలాం యా ఫై, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

నాలా ఆక్రమణపై సర్వే

బేగంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్ నాలా ఆక్రమణల తొలగింపునకు హైడ్రా అధికారులు పూనుకున్నారు. నందిని హోటల్ వద్ద నాలా ఆక్రమణపై సర్వే నిర్వహించారు. గురువారం జీహెచ్ఎంసీ, విద్యుత్, సర్వే అధికారుల సమక్షంలో పెట్రల్ బంక్ నుంచి రహదారి కింద ఉన్న నాలాను ఆధునిక పరికరాల ద్వారా పరిశీలించారు. 10 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని గ్రహించారు. దీంతో రహదారిలో మార్క్ చేసి రోడ్డు తవ్వి పూడిక తీసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నాలా కొలతలు నిర్వహించడంతో రహదారిలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది.

అక్రమ నిర్మాణాలపై కొరడా

ఖైరతాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసి కొరడా ఝుళిపిస్తోంది. ఖైరతాబాద్, షేక్ పేట సర్కిళ్లలో అనుమతి లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై షోకాజ్ నోటీసులిచ్చి యజమానులను పిలిచి వారికి నచ్చచెబున్నారు. అయినా వినకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని సీజ్ చేయడంతో పాటు కూల్చివేస్తున్నారు. ఇప్పటి వరకు సర్కిల్ 18లో అక్రమ నిర్మాణాలపై దాదాపు 20 వరకు హియరింగులు కాగా అందులో స్పీకింగ్ ఆర్డర్లు ఇచ్చినా.. నిర్మాణాలు చేపడుతున్న 6 భవనాలను సీజ్ చేయగా మరో రెండు నిర్మాణాలను కూల్చివేశారు. గురువారం షేక్‌పేటలోని రెండు నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. ఒక చోట జి ప్లస్ 3 అంతస్తులకు అనుమతి తీసుకొని 4,5 ఫ్లోర్లను అక్రమంగా నిర్మిస్తుండగా దానిని సీజ్ చేశారు. మరో సంఘటనలో జి ప్లస్ 2 అంతస్తులకు అనుమతి తీసుకొని 3,4 అంతస్తులు అక్రమంగా నిర్మించగా రెండింటిని సీజ్ చేశామని సర్కిల్ 18 ఉప కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌లు తెలిపారు. ఉప కమిషనర్ రజనీకాంత్ రెడ్డి నేతృత్వంలో 10 రోజుల్లో దాదాపు 13 అక్రమ నిర్మాణాలపై నోటీసులిచ్చి విచారణకు పిలువగా అందులో ఎనిమిదింటికి స్పీకింగ్ ఆర్డర్లు ఇచ్చి రెండు భవనాలను కూల్చివేశారు.

వివాహిత అదృశ్యం

యూసుఫ్ గూడా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ పడి సోదరుడి ఇంటికి వచ్చిన వివాహిత కనిపించకుండా పోయింది. ఈ సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. మహమ్మద్ పాషా సోదరి బీబీ హజ్ర గత నెల 30న భర్తతో గొడవ పడి జవహర్ నగరలో అన్న ఇంటికొచ్చింది. ఈ నెల 10న మార్కెట్ వెళ్లి ఇంటికి ఎంతకీ రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

- సైయెంట్ ఫౌండేషన్ సీఎస్ఆర్ కృష్ణమోహన్

బేగంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో బాలికల హాజరు సంఖ్యను పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు సైయెంట్ ఫౌండేషన్ కృషి చేస్తోందని సంస్థ సీఎస్ఆర్ కృష్ణ మోహన్ అన్నారు. గురువారం ప్రతినిధులతో కలిసి ఆయన రాజ్‌భవన్ స్కూల్‌ను సందర్శించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. 2017లో రాజ్‌భవన్ స్కూల్‌ను తమ చారిటబుల్ ట్రస్ట్ దత్తత తీసుకుందన్నారు. పాఠశాలకు అవసరమైన వాటిని అందిస్తున్నామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సాగర్‌సొసైటీలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన గురువారం సమావేశమయ్యారు. కేంద్రంలో మోదీ సర్కార్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందుకే పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఐదు సూత్రాలతో కూడిన కార్యక్రమాలకు రూపకల్పన చేసిందని, నియోజకవర్గంలో ఈ పనులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

మీ-సేవా నిర్వాహకులకు ఈ -కామర్స్‌పై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవలు నిర్వహించడం వల్ల ఈ-కామర్స్ రంగంలో పెను మార్పులు వస్తాయని మీ-సేవా కమిషనర్ రవికిరణ్ తిరుమల అన్నారు. ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ఐటీశాఖ సంయుక్తాధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో గురువారం మీ-సేవా నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవల వల్ల స్థానిక ఎంఎస్‌ఎంఈ వ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ దీపు థామస్ జాయ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,

చార్మినార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతదయాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. గురువారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ మెంబర్లు కంచెర్ల వందన, మర్రిపల్లి చందన, బి. అపర్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఉమెన్ సేఫ్టీ వింగ్ కమిషనర్ లావణ్య నాయక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో బ్లడ్ డెలివరీ సేవలు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ సేవలను లైటస్ పేరుతో నగరంలో గురువారం ప్రారంభించారు. ఏఐ ఆధారిత బ్లడ్ లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్‌గా దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలోనే దీన్ని ప్రారంభించామని లైటస్ హెల్త్‌టెక్ సీఓఓ సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు. ఇప్పటి వరకు చెన్నైలో 5 వేల మందికి రక్తం సరఫరా చేశామని, దీనికి రెడ్ క్రాస్ సొసైటీ నుంచి అవార్డు వచ్చిందన్నారు. నగరంలో సుమారు 100కు పైగా బ్లడ్ బ్యాంకులు ఉండగా, ఏడాదికి 2,75,000 యూనిట్ల రక్తం అవసరం ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా సరైన సమయంలో రక్తం అందించలేకపోతున్నారు. దీన్ని గుర్తించి హైదరాబాద్‌లో బ్లడ్ బ్యాంకులు, ఆస్పత్రులతో కలిసి సేవలను అందించనున్నామని సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఎయిర్ చీఫ్ మార్షల్

అల్వాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్‌ఏ)లో ఈనెల 14న నిర్వహిస్తున్న 215 కోర్స్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా భారత వాయుసేనాధిపతి(ఎయిర్ చీఫ్ మార్షల్) అమర్ ప్రీత్‌పాల్‌సింగ్ పాల్గొంటున్నారని రక్షణ శాఖ పౌర సంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన కీలకపాత్ర పోషించారు.

రౌడీషీటర్ హత్యకు పథకం

● మరో ముఠా సభ్యుల అరెస్ట్.. 12 కత్తులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పథకం వేసిన రౌడీషీటర్‌తోపాటు గ్యాంగ్ సభ్యులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 కొబ్బరి బొండాం కొట్టే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పహాడిషరీఫ్‌కు చెందిన మహ్మద్ జబ్బార్(43) పాత నేరస్థుడు. గతంలో రౌడీషీటర్ ముర్తుజా అలీ వద్ద పనిచేసేవాడు. జబ్బార్‌పై ట్రై కమిషనరేట్ల పరిధిలో హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, స్నాచింగ్ వంటి 12 కేసులు నమోదయ్యాయి. ఇతడిపై పోలీసులు రెండుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేయగా జైలుకెళ్లొచ్చాడు. ముర్తుజా వద్ద పనిచేయడం మానేసిన తర్వాత సొంత గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ముర్తుజాను చంపేందుకు జబ్బార్ పలు ప్రయత్నాలు చేశాడు. అలీని చంపేందుకు జమీర్ ఖాన్(30), రౌడీషీటర్ సయ్యద్ షాఅబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్(22), మహ్మద్ రహమత్ అలియాస్ సోను(28), సయ్యద్ షా అబ్దుల్ మన్నాన్ అలియాస్ సల్మాన్(31), మహ్మద్ నాసిర్(38)తో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. హత్య కోసం 12 కొబ్బరి బొండాలు కొట్టే కత్తులు కొనుగోలు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 12 కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు మొహసిన్, అజహర్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

● వెన్నెముకలో క్యాన్సర్ కణితి తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న మహిళకు కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళ (55) నడవలేని పరిస్థితిలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెన్నెముక భాగంలో క్యాన్సర్ కణితి పెరిగి పక్షవాతం స్టేజ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. క్యాన్సర్ కణితి తొలగించేందుకు 'ఎన్ బ్లాక్ రీసెక్షన్' శస్త్రచికిత్స చేశారు. మొదటి దశలో ఇంటర్‌వెన్షన్ 'ఎంబోలైజేషన్' పద్ధతిలో రోగికి ఇంజెక్షన్ ఇచ్చి, క్యాన్సర్ కణజాలానికి రక్తప్రవాహాన్ని నిలిపివేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన 24 గంటల తర్వాత వెన్నెముకలో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించారు. కణితి తొలగించిన ప్రాంతంలో ఇంప్లాంట్ అమర్చి నరాలపై ఒత్తిడి లేకుండా శస్త్ర చికిత్సను ఆరు గంటల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె నడవగలిగే స్థితికి చేరుకున్నారని డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్‌కు చెందిన ఆలియా భర్తతో గొడవపడి బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. భర్త వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పగా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె ఈనెల 7వ తేదీన సంజీవయ్య పార్కు సమీపంలో రైల్వే పట్టాల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న తండ్రి మహ్మద్ అక్కడకు వెళ్లి కుమార్తెకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సమయంలో సికింద్రాబాద్ నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఆలియా అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన మహ్మద్‌ను స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



● సంక్షేమ భవన్ ముట్టడి

గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని సంక్షేమ భవన్‌ను ముట్టడించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు.



కంటోన్మెంట్ అన్నానగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు బెలూన్లతో స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి



నల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాల డిజిటల్ స్కూల్‌లో విద్యార్థులతో కేక్ కట్ చేయించి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ కలెక్టర్ (స్పెషల్ ఆఫీసర్) రవి తదితరులు

ముగిసిన సెలవులు
మోగిన బడిగంట

సికింద్రాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసాయి. బడి గంటలు మోగాయి. పాఠశాలలు తెరుచుకున్నాయి. చిన్నారుల ఉరుకులు, తల్లిదండ్రుల పరుగులతో లష్కర్‌లోని పలు ప్రాంతాలు కళకళలాడాయి. పాఠశాలలు గురువారం ఉదయం పునః ప్రారంభం కావడంతో సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లలో కోలాహల వాతావరణం నెలకొన్నది.

క్రమశిక్షణతో కష్టపడి చదవాలి: కార్పొరేటర్

రెజిమెంటల్‌బజార్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని కార్పొరేటర్ కొంతం దీపిక విద్యార్థులకు తెలిపారు. గురువారం మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లోని నం.1 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, ఇన్‌చార్జి సాగర్, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు కొంతం నరేష్, జిత్తు, ప్రశాంత్, నరేందర్, గణేష్, రాహుల్, అజయ్, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

చిలకలగూడలో..

మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ, దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్, రాష్ట్ర ప్రజాభవన్ సూర్యప్రకాష్ విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులకు చదువే ఆస్తి అని, మెరుగైన విద్య ఉచితంగాఅందించటానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మదన్‌మోహన్, కార్పొరేటర్ రాసూరి సునీత, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, టీచర్లు అయేషా బేగం, మల్లీశ్వరీ, శిరీష, దివ్య తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో..

ముషీరాబాద్ మండల ఉప విద్యాశాఖ కార్యాలయ పరిధిలో బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లో పలు ప్రాంతాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వారాసిగూడ బ్రాహ్మణబస్తీ ప్రభుత్వ పాఠశాలలో 71 మంది విద్యార్థులుండగా మొదటి రోజు ముప్పై రెండు మంది విద్యార్థులు హాజరయ్యారని స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.సుజాత, ఉపాధ్యాయులు జి.శివరంజని, బి.ఉషారాణిలు తెలిపారు. బౌద్ధనగర్ అంబర్‌నగర్ ప్రభుత్వ ప్రైమరీ(బాల్వాడీ) పాఠశాలలో 61మంది విద్యార్థులుండగా మొదటి రోజు పద్దెనిమిది మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు డి.మాలతీ, సీహెచ్. వైశాలి తెలిపారు. బ్రాహ్మణబస్తీ, అంబర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలను మామిడి తోరణాలు, పువ్వులు, బుగ్గలతో సుందరంగా అలకరించారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లను పంపిణీ చేస్తున్న జంపన ప్రతాప్‌తో పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి



బన్సీలాల్‌పేట్‌లోని గుండా ఈశ్వరయ్య స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు

మారేడుపల్లిలో..

మారేడుపల్లి జోన్ పరిధిలోని స్కూళ్లలో 65 శాతం మంది హాజరయ్యారు. వీరిన ఉత్సాహ పరిచేందుకు టీచర్స్ తరగతి గోడలకు, ప్రధాన గేట్లకు పూలతో అలంకరించి విద్యార్థినీ విద్యార్థులకు స్వాగతం చెప్పారు.

బోయినపల్లిలో..

బోయినపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చాక్లెట్స్, బిస్కెట్లను అందిస్తూ స్వాగతం పలికారు. అనంతరం ప్రార్థనలు చేశారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, టెంపుల్ కమిటీ సభ్యులు ముఖేశ్ యాదవ్, వరప్రసాద్, అజిత్, పవన్, కాంపల్లి శ్రీకాంత్ చోటు తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



బ్రాహ్మణబస్తీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేసిన అధ్యాపకులు

లాలాపేట్‌లో..

పాఠశాలలకు వేసవి సెలవులు ముగియడంతో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి గురువారం లాలాపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను, యూనిఫార్మ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ బాలు నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మురుగు నీరు స్వాగతం

రెజిమెంటల్‌బజార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న నెం.1 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మొదటి రోజు మురుగు నీటిని దాటుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. బస్తీవాసులు ఇళ్లలోని చెత్తను పాఠశాల ప్రధాన గేటు పక్కన వేయడం అలవాటుగా మారింది. దీంతో పిల్లలు వాసన, మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి చెత్త డంపింగ్‌ను ఆపలేకపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాల గేట్ ముందు నిలిచిన మురుగు నీరు

ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో అమీర్‌పేట డివిజన్‌లోని ఎస్సార్‌నగర్‌లోని పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిశారు. గత ప్రభుత్వం ఎస్సార్‌నగర్‌లో నిర్మించిన కమిటీ హాల్ భవనాన్ని వేలం ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దానిని అడ్డుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సార్‌నగర్‌లో కమిటీహాల్ నిర్మాణం చేపట్టిందని, ఇందులో దాదాపు 80 శాతం మేర పనులు జరిగాయని, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా విక్రయించాలని చూడడం దుర్మార్గమని అన్నారు. కమిటీ హాల్ వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేదంటే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషు కుమారి, ఎస్సార్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ప్రతినిధులు ఇంద్రారెడ్డి, రాజేష్, గౌతమ్‌రెడ్డి, వివేక్‌నాథ్, పెంటయ్య, కృష్ణకాంత్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఆర్‌నగర్‌లో గల కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు

లష్కర్ బోనాలకు ఏర్పాట్లు



పనులను పర్యవేక్షిస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన లష్కర్ బోనాల జాతర ఈ నెల 26వ తేదీన ఘటాల ఎదుర్కోలుతో ప్రారంభం కానుంది. జూలై 13న బోనాలు, 14న రంగం (భవిష్యవాణి) జరుగనున్నాయి. కాగా బోనాల జాతరను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు రంగులు వేసే పనులు మొదలుపెట్టామని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు.



మర్యాద పూర్వక కలయిక

నూతనంగా నియమితులైన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని గురువారం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సికింద్రాబాద్ కార్యదర్శి రామలీలతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాళ్లు భారతి, లలితమ్మలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి శాలువా కప్పి సన్మానించారు. - అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



బస్తీవాసులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

● కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి పేదవాని సొంతింటి స్వప్నాన్ని సాకారం చేయడమే లక్ష్యమని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చెప్పారు. మడ్‌ఫోర్టులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడ్‌ఫోర్టు గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఏర్పాటు చేయనున్న మోడల్ కాలనీ ఏర్పాటు కోసం తిరుమలగిరి రెవెన్యూ అధికారుల సమక్షంలో శుక్రవారం నుంచి సర్వే చేపట్టనున్నట్టు వెల్లడించారు. మోడల్ కాలనీ నిర్మాణం కోసం మొత్తం 18 బస్తీల్లో సర్వే జరుగుతుందని, అరులు శుక్రవారం నుంచి తహసీల్దార్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రూ.45 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బోయినపల్లి 1వ వార్డు బాపూజీనగర్ సెంటర్ పాయింట్ వద్ద రూ. 45 లక్షల బోర్డు నిధులతో నూతనంగా తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు సివిలియం నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, బల్వంత్‌రెడ్డి, సదా, బీజేపీ నాయకులు భానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్, అజయ్ గౌడ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

హరిత వనాలను ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో హరితవనాలను ఏర్పాటుచేయాలని, సీతాఫల్‌మండి చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం అంబేడ్కర్ కూడలి వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులు సువర్ణ, కౌశిక్‌లతో స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు.

సెట్విన్ కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే

సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రం కార్యాకలాపాలు ఆదర్శంగా నిలుస్తాయని, శాసనసభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్ చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రాన్ని పద్మారావుగౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, చిత్రంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

ప్రభుత్వ భూములను కాపాడాలి

బౌద్ధనగర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో కార్పొరేటర్ హేమ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. డివిజన్‌లో ఉన్న కొన్ని ప్రభుత్వ భూములను ప్రయివేట్ వ్యక్తులు కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు కార్పొరేటర్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

లాడ్జ్‌లో వ్యభిచారం.. ముగ్గురు అరెస్టు

బోయినపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పోలీసులకు అందిన పక్కా సమాచారంతో చేసిన దాడిలో బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సెక్స్ రాకెట్ బయటపడింది. నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దీని పైన బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని ఓ హోటల్‌పైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లాడ్జిలో పింకీ దాస్, షేక్ సెబారుద్దీన్‌లు అక్కడ పనిచేస్తున్న సంజీవ్ కుమార్ యాదవ్‌తో కలిసి గుట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయమైన సమాచారం మేరకు లాడ్జిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు నిర్వాహకులతో పాటు, ఓ విటుడిని మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు అనంతరం నిర్వాహకులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి



గుర్తుతెలియని మహిళ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్‌నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫాం నంబరు 1లో గుర్తుతెలియని 55 ఏళ్ల మహిళ చనిపోయి ఉండడంతో డిప్యూటీ స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి రెండు చేతులపై పచ్చబొట్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో ఉంది.

వ్యక్తి అదృశ్యం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : ఊరెళ్లడానికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన అమిత్ కుమార్(35) కూలి పని చేసుకునేందుకు కొన్ని నెలల క్రితం బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి ఊరెళ్లేందుకు బుధవారం అమిత్‌కుమార్‌ను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బైకుపై దింపి, ఫలక్‌నుమాకు జనరల్ టికెట్ తీయించి ఇచ్చి మేస్త్రీ వెళ్లిపోయాడు. గురువారం అమిత్‌కుమార్ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్న బంధువు రోహిత్‌కుమార్ యాదవ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే రోహిత్‌కుమార్ పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు అమిత్‌కుమార్‌పై మిస్సింగ్ కేసు నమోదు చేయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.